క్లుప్తంగా

రేపు కంటి వైద్యశిబిరం

భానుపురి : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సివిజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాం సుందర్‌రెడ్డి, సుధగాని నాగేశ్వర్‌రావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్‌కార్డులను తీసుకురావాలని సూచించారు.

రికార్డుల పరిశీలన



రామన్నగూడెం గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న నారాయణరెడ్డి

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శనివారం డీఎల్‌పీఓ నారాయణరెడ్డి పరిశీలించారు. వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి. గోపి, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన యూనిఫామ్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని 31 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1685 మంది విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరానికి గాను మొదటి విడతగా ఒక్కో జత చొప్పున యూనిఫామ్‌లు ఎమ్మార్సీకి చేరాయి. వీటిని వెంటనే పాఠశాలల వారీగా పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ బాలునాయక్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని వినతి

నాగారం : పేరబోయినగూడెం సమీపంలో బిక్కేరువాగు నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ పలువురు గ్రామస్తులు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరికిషోర్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సాండ్ ట్యాక్సీ పాలసీలో భాగంగా జాజిరెడ్డిగూడెం మండలం తుంగగూడెంలో ఇసుక రీచ్‌కు పర్మిషన్ తీసుకొని అక్కడ కాకుండా అనుమతి లేని పేరబోయినగూడెం గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని అన్నారు. ఇసుక అక్రమ రవాణా వల్ల భూగర్భ జలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, వెంటనే ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు రమేష్, లక్ష్మయ్య, పి.నాగరాజు, పెద్ద ఉప్పలయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బాషపాక శ్రీకాంత్‌ను శనివారం జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి సన్మానించారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ఏఎంసీ డైరెక్టర్ జలేందర్, నర్సింగ వెంకటేశ్వర్లు, బద్దం యాదగిరి, బైరబోయిన మహరాజు, సురేందర్, సత్యం, మల్లయ్య, నిరంజన్, చిరంజీవి, కిరణ్, రాంబాబు, శివన్, శ్రీకాంత్, పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

ప్రజలు ఐకమత్యంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాశ్‌రావు

చివ్వెంల : గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంగా ఉండాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. లింగ, వర్ణ భేదాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంటరాని తనం అమానుషమన్నారు. కులం పేరుతో దూషిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాలయాలకు కలిసి మెలిసి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ దయాకర్, ఆర్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ నర్సయ్య, పంచాయతీ సెక్రటరీ రమేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జీపీఓలుగా ఆరుగురు ఎంపిక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలానికి చెందిన ఆరుగురు వివిధ శాఖల సిబ్బంది గ్రామ పాలన అధికారులు (జీపీఓ)గా ఎంపికయ్యారు. నర్సింగ విజయ్, చింతల వీరయ్య, నలమాద వీరేష్, అశోక్, కవిత, నర్సింగ శోభలు ఎంపికైన వారిలో ఉన్నారు. వీరు గతంలో కొందరు వీఆర్‌ఓలుగా, మరి కొందరు వీఆర్ఏలు పనిచేశారు.

మొలకెత్తిన ధాన్యం.. రైతుల దైన్యం

- తుంగతుర్తి మండలంలోని పలు కేంద్రాల్లో ఇంకా పూర్తికాని కొనుగోళ్లు
- వర్షాలకు తడిసిన వడ్లను కొనేందుకు వెనకాడుతున్న కేంద్రాల నిర్వాహకులు
- ధాన్యం మొలకెత్తిందని తరుగు పేరుతో దోచుకుంటున్న మిల్లర్లు



కొత్తగూడెంలోని కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు



తుంగతుర్తిలోని ఐకేపీ కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు

తుంగతుర్తి : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు ఉన్న రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. అన్నదాతలు రెండు నెలలుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోసి ఉంచారు. కానీ ఇంకా కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. మండలంలో 26 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గానూ దాదాపుగా అన్ని కేంద్రాల్లో ఇంకా ధాన్యం నిలువలు ఉన్నాయి. వర్షాలు పడుతుండడంతో రైతులు ధాన్యాన్ని తిరగబోయడం, ఆరబెట్టడం వంటి పనులు చేస్తున్నారు. మార్కెట్‌కు లారీలను పంపించడంలో నిర్లక్ష్యం కారణంగానే ధాన్యం కాంటాలు కాక ఇబ్బందులు పడాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మొలకెత్తింది. ఒక్కో రైతుకు చెందిన ధాన్యం రాశి వద్ద సుమారుగా రెండు నుంచి మూడు క్వింటాల వరకు ధాన్యం మొలకెత్తింది. అయితే ఐకేపీ నిర్వాహకులు మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకోవడం లేదు. ఒకవేళ చిన్నచిన్న మొలకలు ఉన్న ధాన్యం బస్తాలలో ఉంటే మిల్లర్లు కూడా ఆ ధాన్యాన్ని తీసుకోకుండా కొర్రీలు పెడుతున్నారు. ఒక్కో క్వింటాకు మూడు కేజీల నుంచి 5 కేజీల వరకు తరుగు పేరుతో దోచుకుంటున్నారు. ఇది ఏమిటని ప్రశ్నిస్తే ధాన్యాన్ని దిగుమతి చేయకుండా అక్కడే ఆపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోలు కేంద్రాలలో వర్షాలకు తడిసిపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు తెలుపుతున్నారు. పంట అమ్ముడు పోయేది ఎప్పుడో.. తమకు డబ్బులు వచ్చేది ఎప్పుడో అని అయోమయం చెందుతున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లోని మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా చూడాలని రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

తరుగు తీయకుండా చూడాలి



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి రెండు నెలలు అవుతుంది. వర్షాలకు ధాన్యం రాశులు తడుస్తున్నాయి. కొంత ధాన్యం మొలకెత్తుతోంది. కేంద్రాల్లో మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. ఒకవేళ లారీలలో మొలకెత్తిన ధాన్యం వెళ్తే మిల్లర్లు తరుగు తీస్తున్నారు. అధికారులు స్పందించి మిల్లర్లు తరుగుతీయకుండా చూడాలి.

\- జటంగి సైదులు, రైతు, కొత్తగూడెం

కాంటాలు పూర్తిచేయాలి



రెండు నెలలుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ఉంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో ధాన్యాన్ని తడవకుండా చూడడం ఇబ్బంది అవుతోంది. కొనుగోళ్లు పూర్తికాకపోవడంతో వర్షాకాలం పెట్టుబడికి కూడా అప్పులు చేయవలసి వస్తోంది. ఇప్పటికైనా కాంటాలు వేగవంతంగా పూర్తి చేసి ఇబ్బందులు లేకుండా చూడాలి.

\- కామ యాదయ్య, రైతు, కొత్తగూడెం

డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత

- ఎస్పీ కె.నరసింహ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీ

సూర్యాపేటటౌన్ : డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత అని ఎస్పీ కె.నరసింహ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డ్రగ్స్, గంజాయి అనేవి వినాశకాలు, ఇవి యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని తెలిపారు. వీటిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో అనేక అనర్థాలు



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు

సూర్యాపేటటౌన్ : ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న పొగాకు వినియోగాన్ని నివారించేలా ప్రతి ఒక్కరిని చైతన్యం చేయాలని జనరల్ అండ్ చాతి వైద్య నిపుణుడు డాక్టర్ నరేష్ మామిడి అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని వెన్నెల హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగాకు వినియోగాన్ని నివారించడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ప్రజలు పొగాకు ఉత్పత్తులను అమ్మడం, కొనడం మానివేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడాన్ని ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల నోటి, గొంతు, ఊపిరితిత్తుల క్యాన్సర్లు వచ్చే ప్రమాదముందన్నారు. ఈ కార్యక్రమంలో బయ్యా దయాకర్, నవిలే నాగరాజు, పేరెల్లి రియాజ్, సందీప్, మానస, సాయి, యామిని తదితరులు పాల్గొన్నారు.

3నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

నాగారం : ఈనెల 3నుంచి 16వ తేదీ వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హరికిషోర్‌శర్మ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ఈనెల 3న మామిడిపల్లి, హరిశ్చంద్రతండా, దుర్గాతండా, 4న లక్ష్మాపురం, మేఘ్యతండా, హెమ్లతండా, శాంతినగర్, 5న పసునూర్, మందడివారిగూడెం, 6న చెన్నాపురం, 9న ఫణిగిరి, లక్ష్మణ్‌తండా, 10న పస్తాల, 11న డి.కొత్తపల్లి, బీమ్లతండా, దోడతండా, చంద్రారెడ్డినగర్, 12న నాగారం, పిచ్చిరెడ్డితండా, 13న ఈటూరు, ప్రగతినగర్, కొమ్మగిగూడెం, లింగాలగడ్డ, 16న వర్ధమానుకోట, పేరబోయినగూడెం, కంచుగట్లగూడెం, మంగళిపల్లిగూడెం, నాగారం బంగ్లా, విజయనగర్‌కాలనీ, మాణిక్యతండా, నర్సింహులగూడెం, దబ్బుతండా, సర్వన్‌తండా గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ సదస్సులు ఉంటాయని తెలిపారు. ఈ సదస్సులకు రైతులు సంబంధిత పత్రాలు, ఆధారాలతో హాజరుకావాలని కోరారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మద్దిరాల : జూన్ 3 నుంచి మండలంలో నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ కంఠమయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3న జి.కొత్తపల్లి, రామచంద్రపురం, 4న రెడ్డిగూడెం, మామిండ్లమడవ, 5న మద్దిరాల, గోరెంట్ల, చౌళ్లతండా, 6న ముకుందాపురం, పోలుమల్ల, 9న చిన్ననెమిల, కుక్కడం, 10న చందుపట్ల, గుమ్మడవల్లి, 11న కుంటపల్లి గ్రామాలలో సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు



ఉపాధ్యాయులకు ప్లేట్లు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

సూర్యాపేట అర్బన్ : ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు అని గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ అన్నారు. సూర్యాపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, నంబర్ 2 ఉన్నత పాఠశాలలో ఐదు రోజులపాటు శిక్షణకు వచ్చిన 300 మంది ఉపాధ్యాయులకు శనివారం స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జెల్లా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, అనంతుల సువర్ణ లక్ష్మి, నల్లపాటి మమత, కొక్కుల సంపత్, వనమాల వెంకటేశ్వర్లు, డా.శిరీష, డా.అలేఖ్య, శీనయ్య, నాగరాణి, మాధవి, ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ హుస్సేన్

సూర్యాపేట : కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ ఆరోపించారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందన్నారు. కార్మికులు సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని 12 గంటలుగా మార్చే కుట్ర చేస్తోందన్నారు. ఈనెల 11వ తేదీన హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి గోగుల వీరబాబు, కోశాధికారి ఎస్.కె. వాజిద్, జిల్లా నాయకులు ఎస్.కె. సయ్యద్, గులాం హుస్సేన్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు

ఆత్మకూర్(ఎస్) : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కేవీకే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త నరేష్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శనివారం మండల కేంద్రంతోపాటు గట్టికల్లు గ్రామంలో పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు మట్టి సేకరణ, వివిధ రకాల జీవ ఎరువుల వాడకం, ఎరువుల సమతుల్యం, చెరువు మటితో లాభాలు, పచ్చిరొట్ట ఆవశ్యకత తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని అన్నారు. సాగులో యాంత్రీకరణ, డ్రోన్ వినియోగం, వివిధ పంటలలో చీడపీడల యాజమాన్యంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారిని దివ్య, భారత వ్యవసాయ వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ సీహెచ్ పద్మావతి, వ్యవసాయ విస్తరణ అధికారులు లక్ష్మీప్రసన్న, పవన్, పంచాయతీ కార్యదర్శి కల్పన, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలు చట్టపరంగా పరిష్కరించుకోవాలి

తుంగతుర్తి : భూతగాదాలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలని సీఐ నరసింహారావు, ఎస్ఐ క్రాంతి కుమార్ అన్నారు. శనివారం స్థానిక వారు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. భూతగాదాల విషయమై శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎలాంటి వారిపై అయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల గొట్టిపర్తి గ్రామ శివారులో భూ తగాదా విషయంలో దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



చివ్వెంలలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు



ఆత్మకూర్(ఎస్) : కోటపహాడ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చివ్వెంల : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు సోంబాబు కోరారు. శనివారం మండల కేంద్రంతోపాటు బి.చందుపట్ల, దురాజ్‌పల్లి గ్రామాల్లో ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రచార జాత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు చిలుక రమేష్, బి.దయాకర్, జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు ఆదాం, వెలుగు రమేష్, ధరావత్ లాలు, వీరారెడ్డి, ఏలసీనయ్య, ఆనంద్, వంశీ, నరేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

ఆత్మకూర్(ఎస్) : తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మకూరు మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్, కోటపహాడ్, ఏపూరు, ఆత్మకూరు గ్రామాలలో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు వెలుగు రమేష్, చిలక రమేష్, ధరావత్ లాలు, వీరారెడ్డి, ఆత్మకూరు మండలం ప్రధాన కార్యదర్శి మేక వంశీ, శ్రీనయ్య, ఆనంద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోంబాబు అన్నారు. శనివారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను మన ఊరి ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, కోశాధికారి వెంకటయ్య, మండల అధ్యక్షుడు వీరేందర్, గీత, లాలు, వీరారెడ్డి, ఆడం, శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ



నాగారంలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారి కృష్ణకాంత్

నాగారం : పచ్చిరొట్ట (జీలుగ) విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ఆగ్రో ఎఫ్‌పీఓ వద్ద రైతులకు రాయితీ ధరలపై జీలుగ విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. మట్టిలో సేంద్రియ పదార్థాల మోతాదును పెంచేందుకు, కలుపు మొక్కలను తగ్గించేందుకు, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు జీలుగ సహాయ పడుతుందని తెలిపారు. మండలానికి 18 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని, వీటిని 50 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా పూర్తి ధర రూ.4275 కాగా రాయితీపై రూ.2138లకు రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను తీసుకొని వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీను, సాయి రాజ్, సంధ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం

- వారం వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి



జటంగి లింగయ్య, గంగమ్మ దంపతులు

ఆత్మకూర్(ఎస్) : వారం వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జటంగి లింగయ్య (90) జటంగి గంగమ్మ(82) భార్యాభర్తలు. వీరికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. కాగా అనారోగ్యంతో లింగయ్య ఈ నెల 27వ తేదీన మృతి చెందగా భర్త మృతిని తట్టుకోలేక భార్య గంగమ్మ ఈ నెల 30వ తేదీన మృతి చెందింది. వారం రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి చెందడంతో గ్రామస్తులతో పాటు బంధువుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

షార్ట్ సర్క్యూట్‌తో పూజా సామగ్రి దుకాణం దగ్ధం



దగ్ధమవుతున్న పూజా సామగ్రి దుకాణం

సూర్యాపేటటౌన్: షార్ట్ సర్క్యూట్‌తో పూజా సామగ్రి దుకాణం దగ్ధమైంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. షాపు యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని పూల సెంటర్‌లో తెడ్ల పాండయ్య సన్స్ పూజా సామగ్రి షాపులో శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో షాపులోని సామగ్రి, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా.. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. భారీగా ఆస్తి నష్టం జరిగిందని షాపు యజమాని ప్రవీణ్ తెలిపారు. ఘటన జరిగిన సమయంలో షాపులో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

వర్షాకాలం.. మూగజీవాలు భద్రం

- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ వైర్లకు తగిలి మృత్యువాత పడుతున్న పశువులు
- జాజిరెడ్డిగూడెం మండలంలో నెలరోజుల్లో 20కి పైగా మృతి
- పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు



అర్వపల్లిలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన గేదెతో రైతు(ఫైల్)

అర్వపల్లి : వర్షాకాలం ప్రారంభంలోనే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మూగజీవాలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్‌వైర్లు, తెగిపడిన విద్యుత్‌లైన్లు తగిలి గేదెలు, ఆవులు మృతి చెందుతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో తాజాగా 2రోజుల కిందట గోపాల్‌రెడ్డినగర్, కుంచమర్తి, అర్వపల్లి, కోడూరు తదితర గ్రామాల్లో ఏడు పశువులు చనిపోయి రైతులు రూ. 5లక్షలకు పైగానే నష్టపోయారు. అలాగే నెల రోజుల వ్యవధిలో 20 వరకు పశువులు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఇటీవల వర్షాలకు అర్వపల్లిలో పిడుగు పడి వేముల నాగయ్యకు చెందిన నాలుగు గేదెలు ఒకేరోజు మరణించాయి. తనకు పాడి తప్ప మరో ఆధారం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలతో ఓ వైపు ధాన్యం తడిసిపోయి, కొనుగోలు కాక ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు ఇలా విద్యుదాఘాతంతో పశువులు మరణించడం రైతులకు దెబ్బమీద దెబ్బలా మారింది. కాగా మృత్యువాత పడిన పశువులకు నష్టపరిహారం పొందే అవకాశం ఉన్నప్పటికీ సరైన అవగాహన లేక రైతులు నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించి నష్టపరిహారం అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రూ.70వేలు నష్టపోయా



ఇటీవల గేదెకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్ తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. దీంతో రూ. 70 వేలు నష్టపోయా. పశుపోషణ, వ్యవసాయంపైనే కుటుంబం వెళ్లదీ స్తున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

\-నోముల అర్వపల్లి, పాడి రైతు, అర్వపల్లి

జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాలు పడుతున్నందున పశుపోషకులు తమ పశువులను మేతకు తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు పశువులు వెళ్లకుండా చూడాలి. ఇప్పటి వరకు చనిపోయిన పశువులకు నష్టపరిహారం అందేలా ప్రయత్నిస్తాం.

\- వాస శ్రీకాంత్, విద్యుత్ ఏఈ

ఎనిమిది మందిపై కేసు నమోదు

దంతాలపల్లి : మృతదేహంతో ధర్నా చేసిన ఘటనలో ఎనిమిది మందిపై మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ పిల్లల రాజు తెలిపిన ప్రకారం.. దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలో మే1వ తేదీన పామాయిల్ చెట్లను చెక్కే బరిసెతో గొంతు కోసుకుపోయి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఏనకుంట తండాకు చెందిన రమేష్ మృతిచెందిన విషయం తెలిసిందే. రమేష్ మృతికి కారణమంటూ మృతదేహాన్ని పెద్దముప్పారం గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి ఇంటి ఎదుట ఉంచి బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధర్నా చేశారు.

ఆత్మకూరు మండలానికి 777 యూనిట్లు

ఆత్మకూర్(ఎస్) : గ్రామీణ ప్రాంతాలలో యువత స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించాలనే ఉద్దేశంతో చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జూన్ 2న ఈ పథకాన్ని అమలులోకి తీసుకురానుండడంతో అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సమాచార సేకరణతోపాటు బ్యాంకుల నుంచి సిబిల్ స్కోర్ తీసుకొని అర్హులైన వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. మొదటగా 50వేల రూపాయలకు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అనంతరం రూ.50వేల నుంచి లక్ష రూపాయల రుణానికి దరఖాస్తు చేసుకున్న వాళ్ల దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. కాగా మండలానికి 777 యూనిట్లు మంజూరైనట్లు తెలిసింది. ఎస్సీ కార్పొరేషన్ నుంచి 283, ఎస్టీ కార్పొరేషన్ నుంచి 235, బీసీ కార్పొరేషన్ నుంచి 207, ఈబీసీ కార్పొరేషన్ నుంచి 36, ముస్లిం కార్పొరేషన్ నుంచి 11, క్రిస్టియన్ కార్పొరేషన్ నుంచి 5 యూనిట్లు మంజూరు కాగా వీటిని లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అటెండర్‌కు సన్మానం

కోదాడరూరల్ : కోదాడ పీఏసీఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న కాంపాటి నాగరత్నం ఉద్యోగ విరమణ పొందింది. ఈ సందర్భంగా శనివారం కార్యాలయం ఆవరణలో నాగరత్నం దంపతులను పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, పీఏసీఎస్ మాజీ చైర్మన్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, పార సీతయ్య, చింతలపాటి శ్రీనివాస్, తోట జ్యోతిశ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పీఏసీఎస్ పాలకవర్గం